క్లుప్తంగా

సుబ్రహ్మణ్యుడికి పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అమ్మవార్లకు సారె సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక రామచంద్రాపురం శ్రీ కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రాపురంలో కొలువైన సీతమ్మ, కనకదుర్గమ్మ, గంగానమ్మ దేవతలకు ఆషాఢ సారెను సమర్పించనున్నట్టు రామాలయ ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 8.30 గంటలకు గంగానమ్మకు జలాభిషేకం, అనంతరం రామాలయం నుంచి ఆటోనగర్ కనకదుర్గమ్మ ఆలయానికి, అక్కడి నుంచి తిరిగి రామాలయం వరకు మహిళలతో శోభాయాత్ర నిర్వహిస్తామని పేర్కొంది. అమ్మవారికి సారె సమర్పణ ఉంటుందని, భక్తులంతా పాల్గొనాలని కోరింది.

భక్తులకు అన్నప్రసాద వితరణ



ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ఉన్న సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్యుడికి విశేష పూజలు చేశారు. స్వామివారికి అన్నప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి, అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. పండ్ల వ్యాపారి గంగిశెట్టి నాగ వెంకట గణేష్, దేవి దంపతులు, వారి పిల్లలు సత్యహరిత, వర్ధన్, కుటుంబ సభ్యుల సహకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కమిటీ తెలిపింది. రెండు వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని పేర్కొంది. కమిటీ అధ్యక్షులు గండికోట బాబి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి కంటి నిపుణులు చక్రవర్తి 310 మందికి కంటి పరీక్షలు చేశారు. 15 మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. వీరికి కళ్లజోళ్ల నిమిత్తం సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్‌ఎం అనంత లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

అతిథి ఉపన్యాసం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సమాచార పునరుద్ధరణలో హామ్ రేడియో పాత్ర అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. అకాడమీ ఆఫ్ హామ్ రేడియో విజయవాడకు చెందిన ముఖ్యఅతిథి అర్జ రమేష్ బాబు మాట్లాడుతూ హామ్ రేడియో ఉపయోగించడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని వివరించారు. మరో విశిష్టత అతిథి శివరాం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ ప్రసాద్‌బాబు, లెక్చరర్ టి.వి.రాంబాబులు మాట్లాడారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, బద్రి నారాయణ, జె.రాజాశ్రీకాంత్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టం, శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే నేరాలు, బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం స్థానిక కస్తూరిబా నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై నాగబాబు బాలికల భద్రత కోణంలో, శారీరక సంబంధాలపై మంచి, చెడు స్పర్శల మధ్య తేడాను వివరించారు. సైబర్ నేరాలు సోషల్ మీడియా వేదికల వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవడంలో ఉండే ప్రమాదాలు, ఫేక్ అకౌంట్స్, మోసపూరిత లింకుల ద్వారా జరుగుతున్న నేరాలపై అప్రమత్తం చేశారు. ఆపదలో ఉన్న వారు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా వివరించారు.

నిరుపయోగంగా తోపుడు రిక్షాలు

బుట్టాయగూడెం: గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించే విధంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం తోపుడు రిక్షాలను ఏర్పాటు చేసింది. అయితే అవి నేడు తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా నిరుపయోగంగా పడి ఉన్నాయి. బుట్టాయగూడెం మండలంలో సుమారు 21 పంచాయతీలు ఉండగా వాటిని 18 సచివాలయాలుగా మార్చారు. వీటిలో చిన్న పంచాయతీలకు 2, పెద్ద పంచాయతీలకు 4 చొప్పున అధికారులు కేటాయించారు. అయితే మండలంలోని ప్రతీ పంచాయతీలో కూడా ఈ తోపుడు రిక్షాలు మూలనపడ్డాయి. ట్రాక్టర్‌ల ద్వారా చెత్తను సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఎంపీడీఓ కె.జ్యోతిని వివరణ కోరగా తోపుడు రిక్షాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.



బుట్టాయగూడెంలో నిరుపయోగంగా తోపుడు రిక్షాలు

జాతీయ జెండా ఆమోద దినోత్సవం

జంగారెడ్డిగూడెం: జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ నాయకలు మల్లవరపు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు ఉన్న త్రివర్ణ జెండాను మార్పు చేస్తూ, జెండాలోని రాట్నం స్థానంలో ధర్మపాలనకు చిహ్నమైన అశోకధర్మ చక్రం ఏర్పాటు చేస్తూ ఆమోదించారని, ఈ నేపథ్యంలో జూలై 22ను జాతీయ జెండా ఆమోద దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాతూరి అంబేడ్కర్, బుగ్గవరపు బాబురావు, పాటిబండ్ల సుదర్శన్, మానుకొండ కిషోర్ పాల్గొన్నారు.

25న సీజీఆర్‌ఎఫ్

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 25న విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్ రాజబాబు, స్వతంత్ర సభ్యులు ఎన్ మురళీ కృష్ణ తదితరులు హాజరు అవుతారని వినియోగించుకోవాలని కోరారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన

జంగారెడ్డిగూడెం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుపై జంగారెడ్డిగూడెం పట్టణంలో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బుట్టాయిగూడెం రోడ్‌లో పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి జెట్టి గురునాథరావు నాయకత్వంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. కార్యక్రమంలో విజయరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు వైఎస్సార్ సీపీని చూస్తే వణుకు పుడుతోందని, తమ నాయకులు, కార్యకర్తలను అరెస్టులు దాడులు చేయటం పరిపాటిగా మారిందని అన్నారు. చంద్రబాబుకి పాలన చేతకాకపోతే గద్దె దిగాలన్నారు. గురునాథరావు మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన కడిగిన ముత్యం వలే బయటికి వస్తారని అన్నారు. ఆయనపై కక్ష సాధింపు చర్యలు మాని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్తా, బీవీఆర్ చౌదరి, ముప్పిడి శ్రీనివాసరావు, పీపీఎన్ చంద్రరావు, బత్తిని చిన్న, చిటికెన అచ్యుతరామయ్య, కుక్కల ధర్మరాజు, కుర్రు రవి, నేకూరి కిషోర్, ఐజీ, వీరవల్లి సోమేశ్వరరావు, కత్తి వసంత్, కిరణ్ కుమార్, ఘంటసాల గాంధీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విజయరాజు, గురునాథరావు, నాయకులు, తదితరులు

కక్ష సాధింపులు



ఎంపీపీ కొదమ జ్యోతి

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపులు ఎక్కువయ్యాయని ఎంపీపీ కొదమ జ్యోతి పేర్కొన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు తారాస్థాయికి చేరుకున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనపై దృష్టి పెట్టకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు కూటమి ప్రభుత్వం చర్యలను గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు హయాంలో జరిగిన మద్యం పాలసీపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో కట్టవపాదలగూడెం గ్రామానికి 24 గంటల లైన్ ఏర్పాటు నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, వ్యవసాయ, కమర్షియల్ సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. అలాగే పేరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో పంగిడిగూడెం గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి వివిధ ఫీడర్ల పరిధి విద్యుత్ సరఫరాలో అంతరాయం

టి.నరసాపురం: రుద్రకోటరాజుగూడెం, తీగలవంచ ఫీడర్లలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: స్థానిక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ద్వారకాతిరుమల టౌన్, వసంత్‌నగర్ కాలనీ, కొమ్ముగూడెం, లక్ష్మీపురం కాలనీ, టెంపుల్ ఫీడర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి, జాజులకుంట, నారాయణపురం, గొల్లగూడెం, తిమ్మాపురం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు ధర్నాలు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీలు, సిబ్బందికి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని బుధవారం జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

కామవరపుకోట: రేషన్ బియ్యం సరఫరాలో అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ద్వారకతిరుమల, కామవరపుకోట మండలాల రేషన్ డీలర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు అందరూ సమయ పాలన పాటించాలని, ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పని తీరు బాగోలేదని ఫీడ్ బ్యాక్ వచ్చిన డీలర్లపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు చేసుకోవాలని సూచించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు లబ్ధిదారులతో మర్యాద నడుచుకోవాలన్నారు. వికలాంగులు, వృద్ధులకు వారి ఇళ్ల వద్దే బియ్యం పంపిణీ చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో కామవరపుకోట సివిల్ సప్లయిస్ డీటీ శేషగిరి, ద్వారకా తిరుమల డిటి నాగరాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్

త్రుటిలో తప్పిన ప్రమాదం

కామవరపుకోట: ఇటీవల కురిసిన వర్షాలకు చెక్ పోస్ట్ సమీపంలో పాత ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న విద్యుత్ ఐరన్ టవర్ మంగళవారం ఉదయం నేలకొరిగింది. మండలంలో ఉప్పలపాడు, కామవరపుకోట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిమిత్తం కామవరపుకోట సబ్‌స్టేషన్ నుంచి ఈ టవర్ లైన్లను వేశారు. ఇది జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బీ స్థలంలో ఈ టవర్ ఏర్పాటు చేశారు. ఇటీవల టవర్‌ను అనుకుని భారీ భవనం నిర్మించేందుకు లోతుగా పునాదులు తీయడంతో ఈ టవరు నేలకొరిగిందని, ఒక్కసారిగా టవర్ కూలితే పెను ప్రమాదమే జరిగేదని స్థానికులు చెబుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఆ భవన నిర్మాణానికి లోతుగా తవ్వి వాహనాలతో మట్టిని తరలిస్తున్నారని, విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోకుండా వ్యవహరించడం వల్లే టవరు కూలిపోవడానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈని వివరణ కోరగా రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలియజేసి చర్య తీసుకుంటామని, విద్యుత్ టవర్‌ను వెంటనే పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.



కొత్తూరు చెక్ పోస్ట్ సమీపంలో నేలకొరిగిన విద్యుత్ టవర్

సారా నిర్మూలనకు చర్యలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో నాటు సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభుకుమార్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవోదయం 2.0లో భాగంగా జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న అన్ని గ్రామాల్లో నాటుసారాకి సంబంధించి సామాచారం సేకరించాలన్నారు. జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించి, మద్యం షాపులన్నీ సమయపాలన పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉల్లంఘనలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం సమీపంలోని సాయి కృష్ణ గోశాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేఆర్‌పురం డివిజన్‌లోని కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయిగూడెం వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు 23వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు ఏఓ పోసారావు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఏలూరు జిల్లా ప్రాజెక్ట్ అధికారి బి.వెంకటేష్ మాట్లాడుతూ నవధాన్యాలు ఉపయోగాలు, కషాయాల తయారీని వివరించారు. వ్యవసాయ అధికారులు, గోశాల నిర్వహణ దారులు సుంకర సత్తిరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకుంటున్న ఉద్యాన సహాయకులు

సంక్షేమానికి ప్రాధాన్యత

ఏలూరు టౌన్: పోలీసుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన కె.డేవిడ్‌రాజు కుమారుడు యశ్వంత్ పృథ్వీకి కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగ నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. యశ్వంత్‌కు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ కల్పించినట్టు ఎస్పీ తెలిపారు.

పంటల బీమాను వినియోగించుకోండి

కామవరపుకోట: పంటల బీమాను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు అన్నారు. మంగళవారం మండలంలో కామవరపుకోట, కళ్లచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో గల వరి పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలో 5700 ఎకరాలకు గాను ఇప్పటివరకు 310 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వరి పంట నష్టం జరిగినప్పుడు రైతులకు నష్టం జరగకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతూ తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. ఒక ఎకరానికి రూ.840 ప్రీమియం కట్టాలని, ఈ అవకాశం ఆగస్టు 15 వరకు ఉందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: లింగపాలెం, సింగగూడెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ పంట బీమా పథకం పీఎంఎఫ్‌బీవై గురించి వివరించారు. రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కౌలుదారులకు కౌలు కార్డులు ఇచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార, డీఆర్‌సీ ఉష, టెక్నికల్ ఏఓ ప్రసూన, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరవు, తగరం హేమలత, చిలుకూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కామవరపుకోటలో నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

ద్వారకాతిరుమల: పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ సీపీఎం నాయకులు మంగళవారం ద్వారకాతిరుమలలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక యూటీఎఫ్ భవనంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సీపీఎం జిల్లా స్థాయి రెండో రోజు విస్తృత సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు పసల సూర్యారావు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. పార్టీ అగ్ర నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం ప్రకటించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని పలు ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ సీపీఎం పోరాటాల ఫలితంగానే పేదలకు ఇళ్లు, స్థలాలు, భూములు వచ్చాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ, ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయని విమర్శించారు. కోకో, కొబ్బరి, ఆయిల్ పామ్, మిర్చి, పొగాకు, వరి వంటి పంటల రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, వారికి పునరావాసం కల్పించాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ భవనం వద్ద నుంచి శివాలయం ఆర్చిగేటు కూడలి వరకు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, ఇ.రామకృష్ణ, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

వరాహాల స్వైర విహారం

ద్వారకాతిరుమల ప్రజల ఆవేదన

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమల గ్రామంలో వరాహాలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులు అన్నింటిలోనూ ఇళ్ల వద్దకు చేరి ప్రజల మధ్య సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వరాహాల సంచారం కారణంగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, వర్షాలకు అవి సంచరించడం వల్ల తాము అనారోగ్యాల భారిన పడతామేమోనని భీతిల్లుతున్నారు. వరాహాల సంచారాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. స్థానిక కొత్త బస్టాండు పక్క రోడ్డులో ఇళ్ల వద్ద ఉన్న చెత్తాచెదారంలో ఈ వరాహాలు నిత్యం కనిపిస్తున్నాయి. పలు వీధుల్లో తిరుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వరాహాల సంచారాన్ని నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ పక్క రోడ్డులో ఇళ్ల వద్ద సంచరిస్తున్న వరాహాలు



చెరువు వీధిలో సంచరిస్తున్న వరాహాలు

ఆసుపత్రికి ఆక్సిజన్ కిట్ అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ప్రథమ చికిత్సా కేంద్రానికి ఒక దాత కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆక్సిజన్ కిట్‌ను బహూకరించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ సహకారంతో విజయవాడకు చెందిన ఎస్‌వీ ధనుంజయరావు, కుటుంబ సభ్యులు ఒక ఆక్సిజన్ సిలిండర్ ఫ్లో మీటర్ కిట్‌ను ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు ఆర్ రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, ప్రసాదాలను అందించారు.

ఆక్సిజన్ కాన్సంట్రేషన్ మీటర్ అందజేత

జంగారెడ్డిగూడెం: మానవత స్వచ్ఛంద ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేషన్ మీటర్ మంగళవారం అందజేశారు. మండలాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ అధ్యక్షతన సొలస రాజకుమారి భర్త గుప్తా జ్ఞాపకార్థం ఈ మీటర్‌ను డీసీసీబీ మాజీ అధ్యక్షులు కరాటం రాంబాబు చేతుల మీదుగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమలకు అందజేశారు. వైద్యులు వజ్రకిరణ్, మానవత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు ఆక్సిజన్ కాన్సంట్రేషన్ మీటర్ అందిస్తున్న దృశ్యం



డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ఆక్సిజన్ కిట్ అందజేస్తున్న దాతలు